క్లుప్తంగా

వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 తేదీ వరకు వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులకు ఎంపీడీఓ ఆనంత్ సూచించారు. మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు, పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. గ్రామాలలో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా ప్రోత్సహించాలన్నారు.

మినహాయింపును సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు

నర్సాపూర్: ప్రభుత్వం కల్పించిన ఫీజు మినహాయింపును ఎల్ఆర్ఎస్ ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఇన్నార్, డాక్యుమెంట్ రైటర్లు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఫీజు చెల్లిస్తే ఫీజులో 25శాతం ఫీజు మినహాయింపు లభిస్తుందని వానిని సద్వినియోగం చేసుకోవాలని, ఫీజు చెల్లించి తమ ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పెద్దశంకరంపేటలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి హన్మంత్‌రావుపేటకు వెళ్లే దారిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. రూ.70 లక్షలతో నిర్మిస్తున్న ఈ పనులను ఆయన పరిశీలించి, కాంట్రాక్టర్‌కు పలు సూచనలిచ్చారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. రహదారి పనులు తొందరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, వెంకటేశం తదితరులున్నారు.

పొట్టు లారీలను కట్టడి చేయాలి



బాడీ కంటే అదనంగా పొట్టును నింపి రవాణా చేస్తున్న డీసీఎం

శివ్వంపేట(నర్సాపూర్): వాహన నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళ్తున్న పొట్టు లారీలను కట్టడి చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూప్రాన్–నర్సాపూర్ హైవే నిత్యం పలు లారీలు, డీసీఎంల్లో వాటి బాడీ కట్టే అదనంగా ఇరువైపుల పొట్టుని నింపి రవాణా చేస్తుండడంతో వెనక వచ్చే వాహనాలతో పాటు ఎదురుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత ఆర్టీఏ, పోలీసులు శాఖ చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపించారు.

ఘనంగా విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల కేంద్రంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు హరిరంజన్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు స్వస్తివచనం, అఖండ దీప స్థాపన, గణపతిపూజ, పురుషసూక్తం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హోమం చేశారు.

వృథాగా బూర్గుపల్లి రైతు వేదిక

- మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- వసతులు లేదనే సాకుతో పట్టించుకోని అధికారులు



బూర్గుపల్లి రైతువేదిక



హవేళిఘణాపూర్ రైతు వేదికలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ భవనాల్లేక ఆయా మండలాల్లో నానా అవస్థలు పడుతున్నారు. కానీ దానికి పూర్తి వ్యతిరేకంగా బూర్గుపల్లి రైతు వేదిక అలంకారప్రాయంగా, మందుబాబులకు అడ్డాగా మారింది. వ్యవసాయ అధికారులు మాత్రం రూ.22లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనంలో నీరు, ఇతర వసతులు లేవనే సాకుతో వాటిని వదిలేసి పంచాయతీ రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. రైతులు ఏవైనా అవసరాలుంటే పంచాయతీ వద్దకు రప్పించుకుంటున్నారు.

మండల కేంద్రంలో మరీ అధ్వానం...

మండల కేంద్రం హవేళిఘణాపూర్‌లో గతంలో గ్రామంలో ఉన్న ఏవో కార్యాలయాన్ని అద్దె చెల్లించకలేక రైతు వేదికకు ఏవో కార్యాలయానికి తరలించారు. అక్కడి కూడా నీరు లేదనే సాకుతో మరుగుదొడ్లను వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ విషయంలో వ్యవసాయ అధికారులను అడుగగా కనీస వసతుల కోసం కార్యాలయం నుంచి ఎలాంటి డబ్బులు రావడం లేదని, తామేమీ చేయాలంటూ పేర్కొంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించిన భవనాలను వినియోగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి వీటిని వినియోగించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

అధికారులు తనిఖీ చేస్తూ హెచ్చరిస్తున్న ఫలితం శూన్యం



సీతానగర్ పాఠశాలలో పాడైన బియ్యం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని తనిఖీల్లో అధికారులు హెచ్చరిస్తున్న ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వచ్చిన కూరలు వండుతూ పేద విద్యార్థుల కడుపు కొడుతున్నారు. మంగళవారం సీతానగర్ ప్రాథమిక పాఠశాలలో మెనూ ప్రకారం ఆకుకూరతో, పప్పుచేసి భోజనం పెట్టాల్సి ఉండగా, సోరకాయ కర్రీ చేసి వడ్డించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు పాఠశాలలను తనిఖీ చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ మాత్రం పాటించడం లేదు.

బూజుపట్టి పాడైన బియ్యం

మండల పరిధిలోని సీతానగర్ ప్రాథమిక పాఠశాలలో బియ్యంకు బూజుపట్టి పాడైపోయాయి. పాఠశాలలో విద్యార్థులు కూర్చున్న గదిలో నాలుగు బస్తాల బియ్యం బూజుపట్టి వృథాగా పడి ఉన్నాయి. కొంతకాలంగా ఈ బియ్యం వాడటం లేదు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బియ్యం నెలల తరబడి స్టాక్ ఉండటంతో పాడైతే పాఠశాలలోనే ఎందుకు ఉంచుతున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లతో ఇబ్బందులు



నర్సాపూర్ చౌరస్తాలో వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు

నర్సాపూర్: పట్టణంలోని చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారిపై స్థానిక చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ రెండు వైపుల ఉన్న స్పీడ్ బ్రేకర్లను అలాగే ఉంచడంతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. సంగారెడ్డి వైపు నుంచి స్థానిక చౌరస్తాకు, తూప్రాన్ వైపు నుంచి చౌరస్తాకు వచ్చే రెండు చోట్ల గతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కాగా చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ స్పీడ్ బ్రేకర్లను అలాగే ఉంచడంతో వాహనాలు వెళ్లేందుకు ఆలస్యం అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. చౌరస్తాలో రెండు వైపుల స్పీడ్ బ్రేకర్లు ఉన్నందున గ్రీన్ సిగ్నల్ రాగానే నిదానంగానే వెళ్లాల్సి వస్తుందని, ఎక్కువ వాహనాలు ఉన్నప్పుడు రెండోసారి రెడ్ సిగ్నల్ పడడంతో సిగ్నల్ వద్ద రెండు సార్లు నిలువాల్సి వస్తుందని వాహనదారులు చెప్పారు. సిగ్నల్స్ ఉన్నందున స్పీడ్ బ్రేకర్లు ఎత్తి వేయాలని అధికారులకు చెప్పినా.. స్పందించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

సరిగా పని చేయని సిగ్నల్స్

నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ సరిగా పని చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థ టైమింగ్ లేదని, ఏ వైపు సిగ్నల్ ఎప్పుడు పని చేస్తుందో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే మరమ్మతులు చేయిస్తానని ఆయన చెప్పారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



నర్సాపూర్‌రూరల్: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న లక్ష్మణ్‌గౌడ్

నర్సాపూర్‌రూరల్: మండలంలోని రెడ్డిపల్లి పాఠశాలలో లక్ష్మణ్‌గౌడ్ తన సొంత నిధులతో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించడం కొరకు 500కి పైగా మార్కులు సాధించిన వారందరికీ రూ.2000 బహుమానంగా ఇస్తానన్నారు. అలాగే యూత్ సభ్యులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, రాయిని నవీన్, రాజుగౌడ్, వడ్ల నర్సింహాచారి, వడ్ల నరేశ్, నందు, తేజ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ స్వర్ణలత పరీక్ష ప్యాడ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కిషన్, పాఠశాల కమిటీ చైర్మన్ సంతోష, ఉపాధ్యాయులు అజిత, విఠల్‌రెడ్డి, నర్సింలు, సిద్ధిరాములు, బంగారయ్య, దామోదర్, వీణ, సౌజన్య, స్వప్న, శ్రీనివాస్, రాములు, సలీం తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ స్వప్న మంగళవారం పరీక్ష ప్యాడ్‌లు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లవీన, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్, నాయకులు కిషోర్‌గౌడ్, అంజాగౌడ్, రమేశ్‌గౌడ్, మోగులాగౌడ్, ప్రతాప్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



నిజాంపేట(మెదక్): రామాయంపేటకు ఇంటిగ్రేటెడ్ స్కూలును మంజూరు చేయించనందుకు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ వైభవంగా కుంకుమార్చనలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో మంగళవారం ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ పూర్తయిన బీటీ రోడ్డు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతి గ్రామానికి సంబంధించి బీటీ డబుల్ రోడ్డు పూర్తవ్వడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సంతోషం వ్యక్తం చేశారు. తూప్రాన్–నర్సాపూర్ హైవే నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, లాయక్, రాహుల్ అన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి కృషి రోడ్డు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గుప్తా, సుధాకర్, భిక్షపతి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగపర్చుకోవాలి

మున్సిపల్ కమిషనర్ దేవేందర్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం అవకాశం కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31 లోగా ప్రజలు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. 2020లో రూ. 1000 చెల్లించి రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులు మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ చేయించుకునే వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా



అనిల్ ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు, ఆమె తల్లి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేపట్టిన ఘటన మండలంలోని కూకుట్లపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. కూకుట్లపల్లి గ్రామానికి చెందిన జజ్జరి దివ్య అదే గ్రామానికి చెందిన గొల్ల అనిల్ కొన్నేళ్లుగా ప్రేమించుకున్నారు. గతేడాది మార్చిలో దివ్యకు కొల్చారం గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిగింది. దివ్యకు అనిల్ ఫోన్‌లో పెళ్లి చేసుకుంటానని పలు మెసేజ్‌లు పంపడంతో ఆ దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. అనంతరం ఇద్దరూ విడిపోయారు. కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని అనిల్‌ను దివ్య కోరుతుంది. ఈ క్రమంలో అతడు తప్పించుకొని తిరుగుతున్నాడు. చేసేది లేక దివ్య, ఆమె తల్లి ఎల్లమ్మ యువకుడి ఇంటి ఎదుట రెండు రోజులుగా బైఠాయించారు. అనిల్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు కాముడి దహనం...

శివ్వంపేట(నర్సాపూర్): బుధవారం రాత్రి కాముడి దహనం నిర్వహించి శుక్రవారం హోలీ పండుగ జరుపుకోవాలని వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ తెలిపారు. బుధవారం చతుర్ధశి ఉన్నందున కాముడి దహనం చేపట్టాలని శుక్రవారం 14న పౌర్ణమి సందర్భంగా హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు.

రోడ్డు విస్తరించాలని సంతకాల సేకరణ



రామాయిపల్లిలో సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం నుంచి మెదక్‌లోని పిల్లి కొట్టాల్ వరకు బీటీ రోడ్డును రెండు లైన్‌ల రోడ్డుగా మార్చాలని సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాల్లో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపుగా అన్ని మండల కేంద్రాల నుంచి ఆర్అండ్‌బీ లేదా పంచాయతీరాజ్ రోడ్లను కలుపుతూ రెండు వరుసల రోడ్లు ఉన్నాయని, కానీ ఒక్క వెల్దుర్తి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి మాత్రం ఒకే వరుసగా ఉందన్నారు. ఉన్న రోడ్డు సైతం ధ్వంసం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ఒక వరుసలో ఉన్న రోడ్డును రెండు వరుసల రోడ్డుగా మార్చి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. రోడ్డు విస్తరణ కోసం ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రం కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరేందర్, తాపీ మేస్త్రీలు, హమాలీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

మెదక్‌జోన్: సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. అంతరిక్షంలోకి వెళ్లిన సునీత విలియమ్స్ లాంటి వారితో స్ఫూర్తి పొందాలన్నారు. ఆర్థిక అభివృద్ధిలో మహిళల క్రియాశీలక పాత్ర కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం చట్టాలను అమలు చేస్తుందన్నారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితోనే మహిళా సాధికారత సాధించగలరన్నారు. సమాజ అవసరాలకనుగుణంగా సంపూర్ణ నిర్మాణాత్మక శక్తిగా ఎదిగి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందన్నారు. సావిత్రిబాయి పూలే లాంటి మహనీయురాలతో స్ఫూర్తి పొంది ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల శాఖ అధికారులు శశికళ, నీలిమ, మెప్మా పీడీ ఇందిరా, టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చండూర్‌లో 350 కోళ్లు మృతి



చండూర్‌లోని కోళ్ల ఫారంలో మృతి చెందిన కోళ్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యాధితో వేల సంఖ్యలో కోళ్లు మృతి చెందుతున్నాయి. మంగళవారం మండలంలోని చండూర్ గ్రామంలో రైతు నర్సింహారెడ్డి కోళ్ల ఫారమ్‌లో 350 కోళ్లు మృతి చెందాయి. వేసవి తాపం తట్టుకోలేక కోళ్లు మృతి చెందినట్లు రైతు అనుమానం వ్యక్తం చేశాడు. మృతి చెందిన కోళ్లను గుంతతీసి పూడుస్తామన్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని, పలు కోళ్ల ఫారాల కంపెనీలు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో దాణా సరఫరా చేయకపోవడంతో కోళ్లు చనిపోతున్నాయన్నారు. పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోతే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



జగ్గంపేట ప్రాథమిక పాఠశాలలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల విద్యార్థుల్లో డీఈఓగా గౌతమ్ ఎంఈఓగా మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడిగా శశికాంత్, ఉపాధ్యాయులుగా కవిత, రక్షిత, అశ్విని, వర్షిత, ధనశ్రీ, శరత్ వ్యవహరించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయురాలు మౌనిక అభినందించారు.

ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీటీడీఓగా రాఘవ, హెచ్‌డబ్ల్యూఓగా అరవింద్‌నాయక్, పీఈటీగా నితిన్‌తో పాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు ఒక్కరోజు విధులు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ జయరాజ్, ఉపాధ్యాయులు దుర్గయ్య, నరేందర్, రాజేశ్వరీ, మంజుల, వినోద, సత్యాగౌడ్, గేమ్‌సింగ్, పీఈటీ పాటిల్, ఏఎన్ఎం వెన్నెల తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): ఆశ్రమ పాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని శ్రీవిద్య పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. కలెక్టర్‌గా లక్ష్మీ సహస్ర, డీఈఓగా జూలి, ఎంఈఓగా ఐషా ఫాతిమా, ప్రిన్సిపాల్‌గా అల్బర్ట్ ఫైక్ వ్యవహరించారు. పాఠశాలలో 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తంప్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని తంప్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా నందిని, డీఈవోగా హర్షవర్ధన్, ఎంఈఓగా యమున, హెచ్‌ఎంగా మోసిన్, ఉపాధ్యాయులుగా గణేశ్, దుర్గాప్రసాద్, అర్షద్, ప్రశాంతి, అశ్విత, శ్వేత, పీఈటీగా ప్రణీత్‌కుమార్ వ్యవహరించారు. విద్యార్థులను హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు దీప, సనా బేగం అభినందించారు.

డబుల్‌బెడ్రూంల స్థలం కబ్జా

- కబ్జా నుంచి కాపాడాలని తహసీల్దార్‌కు గిరిజనుల వినతి



కౌడిపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దేవులతండా గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూంల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారు. దీంతో ప్రభుత్వ భూమిని కాపాడాలని తండావాసులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందచేశారు. మండలంలోని తునికి దేవులతండా గిరిజనులు తెలిపిన వివరాల ప్రకారం.. తునికి దేవుల తండా శివారులో మెదక్–నర్సాపూర్ 765డీ జాతీయ రహదారిపై పక్కన 245 సర్వేనంబర్‌లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేరున ఉంది. దీంతో అధికారులు సర్వేచేసి ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించారు. అక్కడ ఉన్న చిన్న రూంపై ఇది ప్రభుత్వ భూమి అని రాసి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో గత ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించి, కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. అక్కడ పనులు కార్యరూపం దాల్చకపోవడంతో భూమి ఖాళీగా ఉంది. కాగా ప్రస్తుతం అక్కడ పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆభూమిని కబ్జాచేసి గదిని ధ్వంసం చేయడంతో పాటు భూమి చుట్టూ కడీలు వేశారు. అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని తండావాసులు కొర్ర శ్రీను, దస్సింగ్, రవీందర్, సురేశ్, ఇస్మాయిల్, జితేందర్, రమేష్‌నాయక్ తదితరులు కోరారు. ప్రస్తుతం దేవులతండా కొత్తగా గ్రామపంచాయతీ కావడంతో భవిష్యత్‌లో గ్రామ పంచాయతీతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు ప్రభుత్వ భూమి అవసరమని చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు.